

కథా కౌముది

# ఒన్స్ ఇనె లైఫ్ టైమ్ జర్నీ

జోగేశ్వర్ చల్లపల్లి

ఆదివారం ఉదయం 7 గం. ల కల్లా లేచి, పెరట్లో కుర్చీలేసుక్కూర్చుని, పూల మొక్కలను చూస్తూ, వేసవి కాలం సూర్యుడు చెట్ల చాటునుంచి తొంగి చూసే వాతావరణం లో కాఫీ నెమ్మదిగా తాగుతూ ఆనందించటమంటే నాకు చాల ఇష్టం. మా వారు కూడా నాతో పాటే పక్కన కూర్చుని ఆ రోజు వార్తలు చదువుకుంటూ, అప్పుడప్పుడు కొన్ని వార్తల మీద వ్యాఖ్యానం చేయటం, నేను "ఊ" అంటూ వినటం మాకు అలవాటు.

ఈ రోజు కూడా అలాగే నడుస్తోంది ఇప్పటివరకు. ఇంతలో ఆయన ఉన్నట్టుండి లేచి పక్కనున్న పూల కుండి వైపు నడిచి వెళ్ళారు. ఆ పక్కన ఓ చిన్న పుల్ల ముక్క ఉంటే, దాంతో కుండిలో మట్టిని కెలకడం మొదలెట్టారు.

" ఏమిటండి, ఏమయింది? " అని అడిగాను కానీ, సమాధానం చెప్పకుండా వచ్చి పక్కన కుర్చీలో కూర్చున్నారు.

కాసేపయిన తరువాత, "ఏమిలేదు, ఆ తులసి కుండి లోంచి ఎదో చిన్న జంతువు, పక్కన పూల కుండీ లోకి దూకి నట్టనిపించింది. నేను న్యూస్ పేపర్ లోంచి కొద్దిగా తలెత్తే సమయానికి అదలా దూకటం చూసాను" అన్నారు.

"ఆ అంతా మీ భ్రమ. ఏదో చిన్న ఫ్లై అయి ఉంటుంది లెండి" అని సర్ది చెప్పాను.

"కాదోయ్! నా అనుమానం నిజం అయితే, అది ఒక ఎలుక పిల్ల అయిఉండాలి" అన్నారు.

"అయ్య బాబోయ్ ఎలుకా? నాకు ఒళ్ళు జుగుల్పు పుడుతోంది, ఎంత పెద్దదండి?" అంటూ గబాగబా ఇంట్లోకి వెళ్ళటం మొదలెట్టా.

నాకు ఎలుకలంటే అసహ్యం. నేను ఎం.స్సీ చదివేరోజుల్లో, బయాలజీ లేబ్ లో ఎలుకల్ని హేండిల్ చేసాంగాని, అప్పుడవి బోనుల్లో ఉండేవి. దాని తిండిలో ఏదో మందుపెట్టి ఇచ్చేవాళ్ళం. అది తిన్నాక, దాని రియాక్షన్ రికార్డ్ చేయటం, అంతవరకే. ఇలా ఇంట్లో, అదే పెరట్లో, విచ్చల విడిగా తిరుగుతూ ఉంటే భయమేస్తుంది.

ఆయన మౌనంగా ఇంటర్నెట్లో, ఎలుకల బోనుల కోసం వెతకటం మొదలెట్టారు.

"ఈ బోన్లు ఎలాటివో తెలుసా! ఒకసారి బోనులోకి ఎలుక వెళ్లిందంటే, ఓ రంపం దాని మెడ మీదో, పొట్టమీదో గట్టిగ దిగపడిపోతుంది. దాంతో అది కదలలేక, ఒక్క సారి చచ్చి వూరుకుంటుంది. పాపం తిండి కోసం అది వెతుక్కుంటుంటే, దాన్నిమోసం చేసి, అలా హింసపెడుతూ చంపడం బాధగా ఉంటుంది. బోను వద్దండి " అని ఆయనకు నచ్చచెప్పటానికి ప్రయత్నించాను.

"అదికాదోయ్. ప్లాస్టిక్వి ట్రాన్స్పరెంట్గా ఉండి, ఎలిక పడ్డాక అది ఎలా ఉందొ చూడొచ్చు. ఇవి చూడు. క్యాచ్ అండ్ రిలీజ్ అంటారు" అని, " ఇదేదో వర్డు ఇల్లీగల్ ఇమ్మిగ్రెంట్స్ గురించో, క్రిమినల్స్ గురించో టీవీలో విన్నట్టు అనిపిస్తోంది." వ్యాఖ్యానించారు .

"తరువాత చూద్దాం లెండి" అనిమాట దాటేసాను.

"సరే ఉన్నరకాలు చూపించాను, ఆ తరువాత నీ ఇష్టం. ఏది కావాలో నువ్వే ఆన్లైన్లో ఆర్డర్చేసుకో" అంటూ ఆయన తన పని మీద వెళ్ళి పోయారు.

ఇంతలో వినాయక చవితి వచ్చింది. అందరి లాగా నేను కూడా బంక మన్ను కొనుక్కుతెచ్చుకుని, ఆన్లైన్లో వినాయకుడి విగ్రహం చేయడం ఎలా, ప్రోగ్రాం చూస్తూ విగ్రహం చేయడం మొదలు పెట్టాను. వినాయకుడి విగ్రహం అయిన తరువాత, చిన్నఎలుక బొమ్మ చేయడం చూపిస్తున్నాడు. అది చేస్తూ ఉండగా అనిపించింది, "మూషిక వాహనం"

అంటూ వినాయకుడితో పాటు ఎలుకని కూడా పూజిస్తాము. మరి అది ఇంట్లో గాని ఇంటి చుట్టుపట్ల గాని కనిపించిందంటే భరించలేము. ఏమిటో మన నమ్మకాలు అనుకుంటూ ఉండగా ఆయన వచ్చారు.

"బాగుందోయి నీ వినాయకుడి విగ్రహం. ఆహా, మూషిక వాహనంకూడా చాలా బాగా చేసావే. మన పూజలకు మెచ్చి పోయి ఇంట్లో తిష్ట వేసుకు కూర్చుంటుందేమో చూసుకో" అంటూ వేళాకోళం పట్టించారు.

"ఏమో, నేనయితే దాన్నింతవరకు చూడలేదు. నిజంగా ఎలుక కాదేమోననిపిస్తోంది" అన్నాను.

"ఖచ్చితంగా ఎలుకే! నేను దాన్ని తరవాత మరోసారి ఆ గోడ కంత లోకి వెళ్లడం చూసాను. దాన్ని పట్టుకోడానికి మన కుక్కనైనా వదలాలి, లేకపోతే పిల్లినైనా పెంచాలి" అన్నారు.

"చాల్లెండి, దానికోసం ఇప్పుడో పిల్లిని పెంచాలా! పిల్లులంటే నాకసహ్యం అని తెలీదూ" కాస్త విసుక్కున్నాను.

"కౌపీన సంరక్షణార్థం హయం పటాటోపహా" అంటూ ఆయన నవ్వారు.

ప్రతిరోజు ఉదయం స్నానం చేసిన తరువాత తులసికుండి దగ్గర దీపారాధన చేసి నమస్కారం చేసుకోవటం నాకలవాటు. వినాయక చవితి పండగ అయిన తరువాత నేను పెట్టిన దీపారాధన కుందె నేల మీద పద పడి ఉండటం గమనించాను. ఇదేదో ఎలుక చేస్తున్న పని కాదు కదా అనిపించింది. మరో వారం రోజులు గమనించాను. ప్రతిరోజూ కాక పోయినా , చాల రోజులు కుందె కింద పడి ఉండటం గమనించాను.

"లాభం లేదండి. దాన్ని ఏదో రకంగా పట్టుకోవాల్సిందే" నా నిర్ణయం చెప్పేసాను.

" నీ వరకు వస్తే గాని కాలు ముందుకు వేయవన్నమాట." అంటూ బోన్ల రకాలు మళ్ళీ చూపించి "ఇందులో ఎలాంటిది కావాలో నువ్వే నిర్ణయించుకో" అన్నారు.

"మీరేచూడండి. పాపం దాన్ని మాత్రం చంపకూడదు."

"ఇదిగో ఈ బ్రాండు ఆర్డరు చేద్దాం. ప్లాస్టిక్ తో చేసినవి. జస్ట్ ట్రాప్ చేస్తుంది అంతే. తరువాత దూరంగా తీసుకు వెళ్లి వదిలేయచ్చు. ఖరీదు కూడాతక్కువే. చైనా లో చేసింది కూడా కాదు" వ్యంగంగా నవ్వుతూ ఆయన సలహా ఇవ్వటం, ఆర్డర్ చేయటం, రెండురోజుల్లో అవి ఇంటి ముందు ఉండటం అన్నిజరిగి పోయాయి.

శనివారం:

ప్యాకెట్ తెరిచి అందులోంచి రెండు బోన్లు బయటకు తీసి కాగితం మీద రాసివున్న సూచనల ప్రకారం ఛీజ్ ముక్కలను పెట్టి వాటిని సిద్ధం చేసారు. ఆయనకి మంచి సరదాగా ఉన్నట్టుంది దాన్ని పట్టుకోవడం.

" ఎలుకా ! (చూడు) నా మజాకా " అంటూ దీర్ఘాలుతీస్తూ , "చూసావా 'నా' అనే అక్షరాన్నిముందుకు లాగేటప్పడికి సరదా అంతా నాదయింది" అంటూగెంతలేయ్య సాగేరు.

"ఏంటో అర్ధం కాలేదు కానీ, మీరు సరదా పడటం మాత్రం బాగుంది" అన్నా.

"అదేనోయ్, మొన్న చూళ్లా 'ఏలికా మజాకానా ' అన్న సినిమా. అందులో చివరున్న'నా' అక్షరాన్ని ముందుకు లాగానన్నమాట" తన వెధవ తెలివితేటలకు మురిసి పోసాగారు.

రెండు బోన్లులో ఒకటి తులసి కుండి దగ్గర, రెండోది దూరంగా గోడ పక్కన ఉంచారు నా సలహా ప్రకారం.

ఆదివారం:

-------------

నా కంటే ముందే లేచి పెరట్లోకి వెళ్లారు. నేను లేచి కాఫీ చేసి తీసుకు వస్తుండగా, గుప్పిట మూసుకుని వస్తూ "ఎస్" అంటూ గుప్పిట చూపించసాగేరు.

"ఏమిటి? " అని అడిగే లోపునే గుప్పిట చూపించి "దొరికింది" అన్నారు.

" ఏంటి బోనులో పడిందా!, ఏంటి ఖర్మకాలి గుప్పిట్లో తీసుకు రాలేదు కదా " అంటూకంగారుపడ్డా.

ఒకసారి దొడ్లోకి పాము వస్తే దాన్ని చంపి, చచ్చిన దాన్ని మెడలో వేసుకుని శివుడు ఇలాగే వేసుకుంటాడు అంటూ తిరిగిన పిచ్చ మొగాడు అనితెలుసు. అలాంటి పనేదో చెసాడేమోనన్న భయం వేసింది.

"లేదు లేవోయ్, కింద బోనులో ఉంది". అని గుప్పిట విప్పి చూపిస్తూ "త్వరగా కాఫీ తాగి తయారవు. ఊరుకు దూరంగా తీసుకు వెళ్లి వదిలేద్దాం" అన్నారు. " పాపం అది ఎప్పుడు బోనులో పడిందో, ఎంత కంగారు పడుతోందో ఏమిటో ! చిన్న పిల్లలాగుందోయ్. దానిపెద్ద దిక్కెక్కడుందో" అంటూ కాస్త జాలితో నిట్టూర్చారు.

"నిజమేనండి. ఊరు చివర వదిలేసి వస్తే పాపం బతగ్గలదో లేదో ఏంటో" కాస్త బాధేసింది.

"మంచి చిక్కులో పడి పోయామోయ్. పిల్ల కదాని వదిలేస్తే, మనం పెట్టిన చీజ్కి అలవాటుపడి ఇంటి చుట్టూ తిరగొచ్చు. ఎలికలుంటే వాటి కోసం పాములు రావచ్చంటారు. అప్పుడు మనం భయం భయంగా బతకాలి. చట్ ! చిన్నదీలేదు, పెద్దదీలేదు, అది మన చుట్టు పక్కల ఉండటం అంత మంచిది కాదు. బయట వదిలేసి రావటమే మంచిది. దానికి ఎంత రాసిపెట్టి ఉంటే అంతే బతగ్గలదు, ఇంకేం ఆలోచించక బయలుదేరు" అంటూ బోను తీసుకురావటానికి వెళ్లారు.

"దాన్ని నాకు మాత్రం చూపించకండి" అని నేను కూడా రెడీ అవటానికి ఇంట్లోకి వెళ్ళాను. నేను వచ్చేటప్పటికి కారులో రెడీగా ఉన్నారు. నేను ఎక్కగానే తెలుగు సినిమా పాటలు పెట్టి పాడుకుంటూ బయలుదేరారు. కొంత దూరం పోయిం తరువాత ట్రాఫిక్లైట్ల దగ్గర ఆగినప్పుడు, నా వైపు చూసి " It's a one in a life time journey" కదా " అన్నారు.

"అంటే? " కుతూహలంగా ఆయన వైపు చూసాను.

“అదేనోయ్. ఆ ఎలలుక ఎప్పుడన్నా కార్ ఎక్కుతా ననుకుందా ? కారు ఎక్కడం ఒక అదృష్టం అయితే మనతో ప్రయాణం చేయటం మరో అదృష్టం. ఎక్కడికి వెడుతోందో దానికి తెలియదు. కొన్ని నిముషాల్లో ఎం జరగబోతోందో తెలియదు. ఈ బోనులోంచి ఎలా బయట పడాలో తెలియదు. ఎవరో వస్తారు, తన్ని రక్షిస్తారు అని ఆలోచించటంతప్ప. పాపం ఏం పాలుపోక బిక్కుబిక్కు మంటూ కూర్చుని ఉంటుంది. ఏదిఏమయినా ” It is a one in ఆ lifetime journey” అని అదేమాట మళ్ళీ అన్నారు.

“ దాని గురించే మరచి పోయాను.ఏది, ఎక్కడ పెట్టారు?” అని కంగారు పడుతూ, నా కాళ్ళ దగ్గర చూసుకున్నాను.

“కంగారుపడకోయ్. క్షేమంగా డిక్కీలో ఉంది. ఏం బయటకు రాదులే, కంగారు పడకు “ అనిసర్దిచెప్పారు.

ఊరి బయటకు వచ్చిన తరువాత, ఒక చెట్టు కింద కారాపి , బోనుతీసుకు వెళ్తూ “ బోనులో వున్న చీజ్ ముక్కలు కూడా ఇస్తాలే” అంటూ దానితో మాట్లాడుతూ తీసుకు వెళ్ళారు.

తిరిగొచ్చి “ now it is in its wild life” ఇక దాని ఖర్మకి దేవుడెలా రాసిపెట్టి ఉంటె అలా జరుగుతుంది. ఫ్రీగా బతగ్గలదో, లేక దేనికయినా ఆహారం అయి పోతుందో ఏం చెప్పగలం “ అంటూ నిట్టూరుస్తూ కారె క్కారు.

“ దానికి ఛీజు ముక్కలు ఇస్తానన్నారు గదా, ఏం చేశారు?” ఎం జరిగిందో వినాలనిపించింది.

“ బోను మూత ఓపెన్ చేయగానే ముందు కాస్త జంకింది. తరువాత ఒక్కసారి బయటకి దూకి తుర్రు మని సెకనులో మాయమయింది. మళ్ళీ అది ఆ ప్రాంతానికి తిరిగి వస్తే గిస్తే తింటుందిలే అని ఒక ఆకు లో వేసి పెట్టా . అంత కంటే ఏం చేయగలం” అన్నారు కార్ స్టార్ట్చేస్తూ.

“ భగవద్గీత లో భగవానుడు ఏం చెప్పాడు. నువ్వు చెయ్యాల్సింది, చెయ్యగలిగింది చెయ్యి, ఆ తరువాత ఫలితం నేను చుపిస్తాను. అన్నాడా.  అలాగే, నేను చేయాల్సింది చేశాను. ఆపైన ఆయన ఇష్టం. ఆ మూషికానికి ఏం జరగాలని ఉందొ భగవంతుడే నిర్ణయిస్తాడు.” అన్నారు.

“ ఆ మాటలు వేరే సందర్భంలోవి గాని మీరిక పదండి. షాపు లో కాసిని సరుకులు కొనుక్కుని వెడదాం” అన్నా కాని , నా మనుసులో కూడా కొంచం అశాంతిగ  ఉన్నట్లనిపించింది.

డ్రైవ్ చేస్తూ ఉన్నట్టుండి నా వైపు తిరిగి “మనం ఇంటికి వెళ్ళేటప్పటికి అది తిరిగి ఇంటికి వచ్చేసుంటే భలేగా ఉంటుంది కదా, ఆ ఎలుక సినిమా లో లాగా!” ఆయన లో కొద్దీ హుషారు కనిపించింది.

“ అదే అని ఎందుకనుకోవాలి, వాళ్ళమ్మో, మరో పిల్ల అయినా అయి ఉండచ్చు గదా. పెద్ద ఫామిలీనేమో” తోడు పలికాను.

“మళ్లీ బోన్లు పెట్టడమే. “They all get their lifetime journey.”  అంటూ కిరాణా షాప్ ముందు కారు  ఆపారు.

Click here to share your comments